ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ లో త్వరలోనే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

- కేంద్ర ప్రభుత్వ పథకాలపై చేనేత కార్మికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అధికారులను ఆదేశించారు.

- రాష్ట్రాన్ని నైపుణ్య కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

- ఆడపిల్లలను ప్రోత్సహించి అవకాశాలు కల్పిస్తే అద్భుతంగా రాణిస్తారని, మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

==================

ఆంధ్రప్రదేశ్ లో త్వరలోనే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ రోజు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆత్మార్పణ దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి, పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సంకల్ప సిద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడుతూ..

చంద్రబాబు నాయుడు (వాయిస్..38 సెకన్లు)

అదే విధంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. దేశంలో ఆంధ్రప్రదేశ్ బలమైన రాష్ట్రంగా ఎదగడానికి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగమే కారణమన్నారు. తన కుటుంబాన్ని దాటి తెలుగువారి కోసం ఆలోచించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని, పవన్ కళ్యాణ్ కొనియాడారు.

==================

కేంద్ర ప్రభుత్వ పథకాలపై చేనేత కార్మికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా కేంద్రంలో ఈ రోజు చేనేత శాఖ అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. సమగ్ర చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం, చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం, నూలు సరఫరా పథకం, నేత కార్మికుల ముద్ర పథకంపై కార్మికులకు అవగాహన కల్పించి, వాటిని వినియోగించుకునే విధంగా చైతన్య పరచాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రాయలసీమ జిల్లాల్లో చేనేత ఉత్పత్తుల తయారీ విధానాన్ని, ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, కేంద్ర మంత్రికి వివరించారు.

==================

భారతదేశంలో 8 లక్షల కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే లక్షా 40 వేల అంకుర సంస్థలు ఉన్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా ఒక ప్రైవేట్ విద్యాసంస్థలో గూగూల్ ఏఐ స్కిల్లింగ్ సెంటర్‌ను ఈరోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు ప్రగతి శీలకంగా ఉంటాయన్నారు. రాష్ట్రాన్ని నైపుణ్య కేంద్రంగా మార్చే క్రమంలో గూగూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదని తెలిపారు. ప్రభుత్వం గూగుల్ వంటి సంస్థలను విద్యార్థుల వద్దకు తేవాలనే లక్ష్యాలను నెరవేరుస్తోందన్నారు. విజయం అదృష్టంతో కాకుండా ఆలోచన ద్వారా మాత్రమే వస్తుందని విద్యార్థులకు వివరిస్తూ ...

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ (వాయిస్..36 సెకన్లు)

===================

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సంస్థానాలు విలీనానికి సర్దార్ వల్లబాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని శ్రీకాకుళం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.వి. మహేశ్వర రెడ్డి కొనియాడారు. ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి కె.వి.మహేశ్వర రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

===================

విరామం

===================

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ జిల్లాల పర్యటనలో భాగంగా ఈరోజు ఒంగోలు గిరిజన సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికై నిర్దేశించిన నిధులను అందుకోసం మాత్రమే ఖర్చు చేయాలని పేర్కొన్నారు. ఒంగోలులో గిరిజన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కు సూచించామని తెలిపారు.

===================

ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని, ఆడపిల్లలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతంగా రాణిస్తారని, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ రోజు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' పేరుతో 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఆడపిల్లలను కాపాడాలనే నినాదంతో, తన సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని స్పష్టం చేశారు. ప్రతి ఇంటిలో ఆడపిల్లలను ప్రోత్సహించాలని, మహిళలు ఎవరిపైనా ఆధారపడకూడదనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలను ముఖ్యమంత్రి తీసుకొచ్చారని మంత్రి వివరిస్తూ..

మంత్రి నిమ్మల రామానాయుడు(వాయిస్..33 సెకన్లు)

ఈ సభలో పాల్గొన్న హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఆడబిడ్డలను రక్షిద్దాం.. సమాజాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. దేశ, రాష్ట్ర పురోభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, అన్ని రంగాలలో మహిళలు పోటీ పడుతున్నారన్నారు.

===================

దక్షిణ అండమాన్ సముద్రం దాని పరిసర ప్రాంతాలలో ఆనుకుని ఉన్న ఉపరితల అవర్తనం సగటు సముద్ర మట్టానికి 3 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది మరింత బలపడి తదుపరి రెండు రోజుల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ తమిళనాడు తీరం వైపు ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణములో వీస్తున్న ఈశాన్య గాలుల ఫలితంగా రాష్ట్రంలో రేపు వాతావరణం పొడిగా ఉండే అవకాశముందని, మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

===================

ధనుర్మాస ప్రారంభ నేపధ్యంలో విశాఖ జిల్లా సింహాచలంలో కొలువుదీరిన శ్రీ వరహా లక్ష్మీనృసింహాస్వామివారి దర్శనం రేపు ఉదయం 8 గంటలకు మొదలవుతుందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 17 వరకు పగల్ పత్తు ఉత్సవములు, ముక్కోటి ఏకాదశి, ధారోత్సవములు, కనుమ పండుగల సందర్భంగా ప్రతిరోజు ఉదయం స్వామి వారి తిరువీధి, విశేష ఉత్సవాలు జరుగుతాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

===================

===================